క్లుప్తంగా

కాచి చల్లార్చిన నీటిని తాగాలి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న అధికారులు

సూళ్లూరుపేట రూరల్ : అంటు వ్యాధులు ప్రబలకముందే జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు. సూళ్లూరుపేట మండలం కేసీఎస్‌గుంట పంచాయతీలో గురువారం డయేరియా నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. అనంతరం గ్రామాల్లో మురుగు కాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. జేసీబీలతో వ్యర్థాలను, పేడ దిబ్బలను తొలగించారు. పంచాయతీ కార్యదర్శి సుధీర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోటమ్మ గ్రామోత్సవాలకు ఏర్పాట్లు



ఉత్సవాలకు ముస్తాబవుతున్న కోటమ్మ దేవస్థానం

కోట: ఈ నెల 29 నుంచి రెండు రోజులు గ్రామదేవత కోటమ్మ గ్రామోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తెలిపారు. ఉత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఈ ప్రాంత ఆరాధ్య దైవంగా వెలుగొందుతున్న కోటమ్మ అమ్మవారి గ్రామోత్సవాలకు వందలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 4 గంటలకు సముద్ర స్నాన ఘట్టంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఆదివారం పరివార దేవతాగణం వెంటరాగా అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా జరుగుతుందని తెలిపారు.

అవకతవకలపై విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న మునెయ్య

దక్కిలి : తిరుపతి జిల్లాలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో చోటు చేసుకున్న అవకతవకలపై విచారణ చేపట్టాలని ఏపీ ప్రజా సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు గద్దల మునెయ్య డిమాండ్ చేశారు. ఆయన గురువారం దక్కిలిలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 27వ తేదీన ప్రవేశ పరీక్ష దరఖాస్తులు స్వీకరించారని తెలిపారు. పరీక్షల నిర్వహణలో పలు అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. క్రమంలో దక్కిలి గురుకుల పాఠశాలలో 7, 8 తరగతులకు పరీక్షలు నిర్వహించలేదన్నారు. దీనిపై జూలై 1వ తేదీన విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ రోటరీ సభ్యులు

సూళ్లూరుపేట రూరల్: సూళ్లూరుపేటలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సూళ్లూరుపేట, షార్ సహకారంతో గురువారం పట్టణంలోని అలవల కంటి వైద్యశాలలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రోటరీ అధ్యక్షుడు అట్రంబాకం దశరథరామిరెడ్డి మాట్లాడుతూ తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి వైద్య నిపుణులు రోగులకు వైద్య పరీక్షలు చేశారని పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని టైనిటాట్స్ విద్యాసంస్థల ఎండీ వేనాటి ధనుంజయరెడ్డి ప్రారంభించారని వెల్లడించారు. సుమారు 200 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేసి 65 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారని తెలిపారు. వైద్యులు సాయిబాబా, వేనాటి విజయలక్ష్మి, సుంకర ప్రతిమ, శ్రీరాములు యాదవ్ పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



పెళ్లకూరు: స్వర్ణముఖి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న పుల్లూరు, కలవకూరు గ్రామాలకు చెందిన రెండు ట్రాక్టర్లను గురువారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నట్లు నాయుడుపేట సీఐ జగన్నాథరావు తెలిపారు. కలవకూరు సమీపంలోని స్వర్ణముఖినది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేసినట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్ల డ్రైవర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వేపతో చీడపీడలకు చెక్

భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో వేప చెట్టుకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అందులో ఉన్న ఔషధ గుణాలు మనిషికి ఎంతగానో మేలు చేస్తాయి. అందుకే ప్రతి ఇంటా వేప చెట్టు ఉండాలని పెద్దలు చెబుతుంటారు. అలాంటి వేప పంటల సాగులోనూ కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు చెబుతున్నారు. పంటల సాగులో వేప ఉత్పత్తులను వినియోగించడం ద్వారా ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడి పొందవచ్చని సూచిస్తున్నారు. అంతేగాక భూమి సారవంతం అవుతుందని, చీడపీడలకు చెక్ పెట్టవచ్చని వెల్లడిస్తున్నారు. – చిల్లకూరు

- భూసారం పెంపు
- అధిక దిగుబడులు
- ఏవో గూడూరు భవాని



వేప గింజలను ఆరబెడుతున్న మహిళ

వేపలో అజాడిరాక్టిన్ అనుకూల పదార్థం ఉంటుంది. దానికి సుమారు 300 రకాల కీటకాలను నాశనం చేసే శక్తి ఉందని పలు పరిశోధనల్లో తేలింది. ముఖ్యంగా నల్లిజాతి పురుగులు, చెదలు, భూమిలోని నెమటోడ్స్, కొన్ని రకాల బూజు శిలీంద్రాలను సైతం అరికడుతుంది. వరి, పత్తి, అపరాలు, కూరగాయలు, పండ్ల మొక్కలు, కాఫీ, జొన్న, ఉద్యాన పంటలను ఆశించే కీటకాలను వేప అరికడుతుంది. మార్కెట్టులో వేప పిండి, వేప నూనె, వేప కషాయాలు తదితర ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి.

కీటకాల నివారణలో కీలకం

గతంలో వేప గింజలను గానుగ ఆడించి నూనె తయారు చేసే వారు. దాన్ని డ్రమ్ములు, డబ్బాల్లో నిల్వ చేసుకుని వినియోగించేవారు. నేడు మార్కెట్‌లో నీమ్ ఆయిల్ పేరుతో విక్రయిస్తున్నారు. దాన్ని వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు వినియోగిస్తే కీటకాలను పూర్తిగా నివారించవచ్చు. ఈ మందు స్ప్రే చేసినప్పుడు పురుగులు చేదును పీల్చుకుని వికారం కలిగి పైరును తినేందుకు ఇష్టపడవు. పంటలపై విషపూరిత అవశేషాలు లేకపోవడం వల్ల మిత్ర పురుగుల ఉత్పత్తి ఎక్కువ అవుతుంది. పక్షులు, తేనెటీగలు వంటి వాటికి హానిచేయక పోవడంతో పంటపై ఉన్న కీటకాలను సంహరించేందుకు ఎంతోగానో ఉపయోపడుతుంది. సమగ్ర సస్యరక్షణలో వేప మందులు బాగా ఉపయోగపడతాయి. పురుగు మందులు, శిలీంధ్ర నాశినులతో వేపను సురక్షితంగా పిచికారీ చేసుకోవచ్చు.

పిచికారికి చేసేందుకు సానుకూల సమయం

పైరుకు పురుగు ఆశించిన వెంటనే వేప నూనెను పిచికారీ చేయాలి. తల్లి పురుగు గుడ్లు పెట్టినట్లు గమనించిన వెంటనే చేస్తే ఇంకా మంచి ఫలితాలు ఉంటాయి. ఎకరాకు 3 నుంచి 5 మిల్లీలీటర్ల నీమ్ ఆయిల్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వాతావరణం చల్లగా ఉన్న సమయంలో ఉదయం కానీ, సాయంత్రం పూట కానీ పిచికారీ చేయాలి. స్ప్రే చేసిన ఆరుగంటలలోగా వర్షం వస్తే మరలా ఒక సారి స్ప్రే చేయాలి.

తెగుళ్ల నివారణ ఇలా..

వివిధ పంటలపై వేప మందులు వాడడం వల్ల పలు రకాల చీడ పీడలను నివారించవచ్చు. వరి పంటకు ఎకరాకు 150 నుంచి 200 కిలోల వేప పిండిని దుక్కిలో వేసి దున్నితే కాండం తొలిచే పురుగు, ఉల్లికోడును అదుపు చేయవచ్చు. వరి పైరుపై లీటరు నీటికి 3 మిల్లీ లీటర్ల చొప్పున కలిపిన వేప ద్రావణంను పిచికారీ చేస్తే అగ్గి తెగులు, తొడిమి కుళ్లు, పొడతెగులు, వరి తుంగ్రో వైరస్‌ను నివారించవచ్చు. అలాగే మిరప పంటను ఆశించిన తెల్ల దోమను అరికట్టేందుకు 5 శాతం వేప గింజల కషాయాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అలా చేయడం వల్ల జెమినీ వైరస్ అదుపులో ఉంటుంది. వేరుశనగ పంటను ఎక్కువగా ఆశించి నష్టపరిచే తిక్క ఆకు మచ్చ తెగులు, టమాటలో ఎండు తెగులును వేప నూనెతో నివారించవచ్చు.



వేప చెట్టు

తయారీ చాలా సులభం

వేప కషాయాన్ని ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. 5 కేజీల వేప గింజలను నలుగగొట్టి 6 నుంచి 7 లీటర్ల నీటిలో రెండు రోజులు పాటు నాన బెట్టాలి. దాన్ని చిన్న పాటి గుడ్డ ద్వారా వడకట్టి మరో వంద లీటర్ల నీటిని కలిపి వినియోగించుకోవాలి.

మంచి ఫలితాలు సాధించవచ్చు



చీడ పీడల నివారణలో వేప కీలకంగా పని చేస్తుంది. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయంలో వేప ఉత్పత్తుల వినియోగంపై అవగాహన కల్పిస్తోంది. వేప ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇస్తోంది. రైతులు ఇంటి పెరటిలో ఉన్న వేప ఆకులు, కషాయం, బెరడు, వేప గింజల ద్వారా వచ్చే నూనె, పిండిని పొలంలో వేసి దున్నితే పంటలకు చీడ పీడలు సోకవు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చు.

– గూడూరు భవాని, ఏవో, చిల్లకూరు

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



దక్కిలి: నేను బడికి పోతా ర్యాలీ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఎంఈవోలు

దక్కిలి: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందజేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో లీలా మాధవి తెలిపారు. వారు గురువారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో కలిసి నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ దక్కిలి జెడ్పీ హైస్కూల్ నుంచి కమ్మపల్లి రోడ్డు సెంటరు వరకు సాగింది. అక్కడ విద్యార్థులు మానవహారం ఏర్పాటుచేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు అందే సౌకర్యాలు, ఉత్తమ బోధనపై వివరించారు. ఎంఈవో కె.వెంకటేశ్వర్లు, దక్కిలి కాంప్లెక్స్ హెచ్‌ఎం నాగరాజు పాల్గొన్నారు.

నేను బడికి పోతాపై ర్యాలీ

సూళ్లూరుపేట రూరల్ : బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని ఎంఈవోలు శ్రీనివాసులు రెడ్డి, శీనయ్య తెలిపారు. సూళ్లూరుపేట పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో గురువారం నేను బడికి పోతా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈవోలు మాట్లాడుతూ పిల్లలు ఉండాల్సింది పనిలో కాదని బడిలోనన్నారు.

మాతాశిశు మరణాల నివారణకు ప్రత్యేక చర్యలు

వెంకటగిరి రూరల్ : మాతా శిశుమరణాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి నాగేంద్రకుమార్ తెలిపారు. ఆయన గురువారం వైద్యులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చింతగుంటలో మాతాశిశుమరణాలపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న కిట్లను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. అనంతరం మహిళలకు రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో స్పెషల్ అధికారి బేబిరాణి, డీపీహెచ్‌ఎన్‌వో ఇన్‌చార్జి పి.ప్రకాష్, వైద్యాధికారి శివకృష్ణారెడ్డి, సూపర్‌వైజర్ సునీల పాల్గొన్నారు.

అమ్మవారి హుండీ ఆదాయం రూ. 59 లక్షలు

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట చెంగాళ పరమేశ్వరి ఆలయ హుండీలోని కానుకల ద్వారా రూ.59,51,539 ఆదాయం వచ్చినట్లు దేవదాయ శాఖ కమిషనర్ డబ్బుగుంట వెంకటేశ్వర్లు తెలిపారు. ఆలయంలో గురువారం హుండీలోని 105 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించినట్లు పేర్కొన్నారు. నగదుతో పాటు యూఎస్‌ఏ డాలర్లు-27, యూఏఈ దినార్స్-5, మలేషియా-1, రిగ్గిట్, కువైట్ 1/4 దినార్లు, సింగపూర్ డాలర్లు-10, వియత్నండొంగ్-20, ఇంగ్లాండ్ -5 పౌండ్స్, ఫిలిప్పైన్స్-100 పిసోతో పాటు బంగారం 45 గ్రాములు, వెండి 120 గ్రాములు వచ్చినట్లు వివరించారు.



హుండీలోని కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ఘనంగా హజరత్ ఖాదర్‌షావలీ గంధోత్సవం



జెండాలతో ఊరేగింపుగా వస్తున్న నిర్వాహకులు, భక్తులు



విద్యుత్ దీపాలంకరణలో దర్గా ప్రాంగణం

నాయుడుపేట టౌన్: పట్టణంలోని హజరత్ ఖాదర్‌షావలీ దర్గా 40వ గంధోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దర్గాను విశేషంగా అలంకరించారు. గడియారం సెంటర్ నుంచి దర్గా వరకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాత్రి నీలిశెట్టి కుటుంబ సభ్యులు, పఠాన్ అమీర్‌ఖాన్ ఇళ్ల నుంచి నిషాన్ జెండాలు తీసుకుని పట్టణంలో ఊరేగించి దర్గా వద్దకు తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. అనంతరం పట్టణంలోని కాలేషా సాహెబ్ ఇంటి నుంచి ఆయన కుమారులు చాన్‌బాషా, శేఖర్ శ్రీవారి గంధాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథం (గుమ్మటం)పై పెట్టుకుని నగరోత్సవం చేపట్టారు. శుక్రవారం తెల్లవారుజామున దర్గా వద్దకు చేరుకుని పాతేహాలను నిర్వహించారు.



పూలతో అలంకరించిన ఖాదర్‌షావలీ దర్గా

అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పాత బస్టాండు వద్ద అన్నా క్యాంటీన్‌ను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ జనార్దన్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం పాత బస్టాండు వద్ద ఉన్న అన్నా క్యాంటీన్ భవనంలో ఉన్న గరిడీవీధి సచివాలయాన్ని మండల రెవెన్యూ కార్యాలయం సమీపంలో ఉన్న పాత భవనాల్లో ఏర్పాటు చేసుకోవాలని సచివాలయ అడ్మిన్‌కు సూచించినట్లు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకుత్వరలో అన్నా క్యాంటీన్ ప్రారంభిస్తామన్నారు.

మండలానికి చేరిన విద్యార్థుల షూస్, సాక్స్

రాపూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలకు ప్రభుత్వం అందిస్తున్న షూస్, సాక్స్ గురువారం రాపూరుకు చేరినట్లు ఎంఈవో 2 జిలానీ బాషా తెలిపారు. మండలంలోని 78 ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు 4,285 మంది బాలబాలికలు చదువుతున్నారని తెలిపారు. వారికి ఒక జత షూస్, రెండు జతల సాక్స్ అందజేయనున్నట్లు తెలిపారు. వాటిని శుక్రవారం నుంచి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు పంపిణీ చేస్తామన్నారు.

బస్టాండులో దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు

రాపూరు: స్థానిక ఆర్టీసీ బస్టాండులో ఉన్న ఖాళీ స్థలంలో దుకాణాలు ఏర్పాటుచేసుకుని వ్యాపారం చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ అనీల్ కుమార్ తెలిపారు. బస్టాండులోని 7 దుకాణాలకు టెండర్ల ద్వారా స్థలాన్ని కేటాయిస్తామని పేర్కొన్నారు. జూలై 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

చిల్లకూరు : ఏపీ గురుకుల పాఠశాల, కళాశాలలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ప్రభుత్వం గురువారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 6వ తరగతికి 76 మంది దరఖాస్తు చేసుకోగా 52 మంది, 7వ తరగతికి 71 మంది దరఖాస్తు చేసుకోగా, 65 మంది, 8వ తరగతిలో ప్రవేశానికి 52 మంది దరఖాస్తు చేసుకోగా 46 మంది, 9వ తరగతికి 26 మంది దరఖాస్తు చేసుకోగా ఇద్దరు హాజరయ్యారని ప్రిన్సిపాల్ మీరా సాహెబ్ తెలిపారు. త్వరలోనే విద్యార్థులకు ఫలితాలు తెలియజేసి అడ్మిషన్లు కల్పిస్తామని తెలిపారు.

ఒకటిన సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ

చిల్లకూరు : సామాజిక పింఛన్లను జూలై ఒకటో తేదీన సచివాలయ సిబ్బందితో ఇంటి వద్దే పంపిణీ చేస్తామని ఎంపీడీవో భానుమూర్తి తెలిపారు. గతంలో ఇచ్చినట్టే వేలిముద్రలు, కనుపాపలు, తీసుకోవడం ద్వారా పింఛను మొత్తం అందజేస్తారని తెలిపారు. పింఛను పంపిణీపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

కండలేరులో 6.330 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 6.330 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 10, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేదురుమల్లిని కలిసిన సైదాపురం నేతలు



నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డితో సైదాపురం మండల వైఎస్సార్‌సీపీ నేతలు

సైదాపురం : వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని సైదాపురం వైఎస్సార్‌సీపీ నేతలు గురువారం వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాజకీయ అంశాలపై చర్చించారు. పార్టీ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరాజు, సొసైటీ మాజీ అధ్యక్షులు మోహన్‌రావు, శివకుమార్, నాయకులు మాలకొండరెడ్డి, అబ్బిరాజు, శ్రీనివాసులురెడ్డి, సుబ్బారెడ్డి, రాజారెడ్డి, శివారెడ్డి, గోపాల్‌యాదవ్, రాజశేఖర్‌నాయుడు, సుధాకర్‌యాదవ్, ఎంపీటీసీలు శంకర్‌రాజు, వెంకటరమణయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆశీర్వాదం

వెంకటగిరి రూరల్ : వైఎస్సార్‌సీపీ రూరల్ అధ్యక్షుడు కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మొగళ్లగుంట సర్పంచ్ శ్రీశబరి కుమార్తె సాయి భుమిజారెడ్డి ఓనిల వేడుక గురువారం నిర్వహించారు. ఇందులో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. అదేవిధంగా పట్టణంలోని వెలమపాళెంకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చింతపట్ల సురేష్ నాయుడు మృతిపై సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



చిన్నారి సాయిభూమిజ రెడ్డిని ఆశీర్వదిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

గంగ పనులు పూర్తి చేసేందుకు కృషి

దొరవారిసత్రం : సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఆగిపోయిన తెలుగు గంగ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం సూళ్లూరుపేట సబ్ డివిజన్ స్థాయిలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ రైతుల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సూపర్ సిక్స్ కింద వివిధ పథకాలు అందజేస్తామని తెలిపారు. ఇందులో భాగంగానే అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతు కుటుంబానికీ రూ.20 వేలను రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుందని వివరించారు. సముద్రతీర గ్రామాల్లోని ఆగిపోయిన చెక్‌డ్యామ్ పనులు, వివిధ గ్రామాల్లో ఏళ్ల తరబడి నిలిచిపోయిన గంగ పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ, వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు, నాయకులు సుధాకర్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, చెంగయ్య, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ కిట్ల పంపిణీ

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని ఎల్‌ఏ సాగరం ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం స్కూల్ కిట్లను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని పిల్లలకు సూచించారు. ఎంఈవో మునిరత్నం మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత శిఖరాలు సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. నాయకులు నెలవల రాజేష్, ఉయ్యాల ప్రవీణ్ కుమార్, గూడూరు సుధీర్ రెడ్డి, అవధానం సుధీర్, వినుకొండ ధనుంజయ, హెచ్‌ఎం అన్నమణి, తెలుగు పండిట్ గడదాసు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్కూల్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

విద్యార్థులకు నగదు బహుమతి



పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులతో సేవా సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు



నగదు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో నసీంఆలీ

తడ: పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురువారం సూళ్లూరుపేటకు చెందిన ఆచార్య భరద్వాజ సేవా సమితి ప్రతినిధులు నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు అందజేశారు. తడ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో 579 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన బత్తుల వెంకటకీర్తి, 574 మార్కులతో రెండో స్థానంలో నిలిచిన కె.హరిణి, 572 మార్కులతో మూడవ స్థానం సాధించిన బత్తుల ధనుశ్రీ, 564 మార్కులతో నాలుగో స్థానంలో నిలిచిన రాజా షాలినిని సత్కరించారు. అదే విదంగా 500కు పైగా మార్కులు సాధించిన మరో 23 మందికి నగదు ప్రోత్సాహకంతోపాటు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లికార్జున రావు, హెచ్‌ఎంలు కేశ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.

వాకాడు : స్థానిక ఎన్‌బీకేఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇటీవల 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో మండల స్థాయిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు గురువారం పూర్వ విద్యార్థులు నగదు బహుమతులు అందజేశారు. మండల టాపర్‌గా నిలిచిన కె మంజుషకు ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన పి.కీర్తికి రూ.15 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన గురులోకేష్‌కు రూ.10 వేలు ఇచ్చారు. ఎంఈవో నసీం ఆలీ మాట్లాడుతూ 1999లో ఇదే పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులు ముందుకొచ్చి విద్యార్థులను ప్రోత్సహిస్తూ నగదు బహుమతులు, సీల్డులు అందజేయడం అభినందనీయమని కొనియాడారు. హెచ్‌ఎం ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

మూలన పడిన 108 అంబులెన్స్



డీవీ సత్రంలో దెబ్బతిన్న 108 అంబులెన్స్



108 వాహనానికి బిగించేందుకు తీసుకువచ్చిన సెకండ్ హ్యాండ్ క్యాబిన్ డోర్

- ప్రమాదానికి గురై దెబ్బతిన్న వైనం
- మరమ్మతులు చేయించని అధికారులు

దొరవారిసత్రం : రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన, అత్యసర సమయాల్లో రోగులను సరైన సమయంలో ఆస్పత్రికి తరలించేందుకు గత ప్రభుత్వం ప్రతి మండలానికి ఒక 108 అంబులెన్స్ వాహనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. దొరవారిసత్రానికి సంబంధించిన 108 వాహనం ఏప్రిల్ 17న జాతీయ రహదారిలో అదుపుతప్పి ముందువెళుతున్న లారీని ఢీకొంది. దీంతో 108 వాహనం భారీగా దెబ్బతినింది. దాన్ని దొరవారిసత్రంలోని పీహెచ్‌సీ సమీపంలో ఉంచారు. మరమ్మతులు చేసేందుకు రూ.4.50 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలియడంతో పట్టించుకోకుండా వదిలేసినట్లు సమాచారం. దీంతో క్షతగాత్రులు, గ్రామాల్లోని రోగులకు సకాలంలో వైద్య సేవలు అందక నానా ఇబ్బందులు పడుతున్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలోనే అత్యధికంగా డీవీ సత్రం మండలంలో 16 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. ప్రమాదాలు కూడా అధిక సంఖ్యలో జరుగుతుంటాయి. మారుమూల గ్రామాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఈ క్రమంలో ప్రజలకు 108 వాహన సేవలు ఎంతో అవసరం ఉన్నాయి. స్థానికంగా 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో జాతీయ రహదారిపై ఎక్కడ ప్రమాదం జరిగినా? గ్రామాల్లో రోగులకు ఎలాంటి అత్యవసర పరిస్థితి ఏర్పడినా సూళ్లూరుపేట లేదా నాయుడుపేట నుంచి వాహనం రావాల్సి ఉంది. సరైన సమయంలో 108 వాహనం రాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డీవీ సత్రం 108కు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.